క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్పిన్నింగ్ మిల్లు కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్లు, శంకర్ విలాస్ ఏరియా, ఫారెస్ట్ అకాడమీ, దూరదర్శన్, రామచంద్రరావు కాలనీ, బత్తిన నగర్, ఆల్వాల్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్ నగర్, సాయిదుర్గానగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.

- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జాంపేట, గణేశ్ చౌక్, లక్ష్మీవారపుపేట, తుమ్మలోవ, ఆర్యాపురం ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి



ఆర్డీఓ కృష్ణ నాయక్‌ను కలిసిన అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణ నాయక్‌ను డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు కోరారు. గురువారం నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో కలిసిన అనంతరావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

డ్వాక్రా సొమ్ము గల్లంతుపై దర్యాప్తు



డ్వాక్రా సొమ్ము గోల్‌మాల్‌పై విచారణ జరుపుతున్న అధికారులు

కడియం: కడియపులంక గ్రామపంచాయతీ పరిధిలోని స్వయం సహాయక సంఘాలలో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి నిధుల్లో జరిగిన లక్షల రూపాయల గోల్‌మాల్‌పై దర్యాప్తు మొదలైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు 15 మంది సభ్యులతో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. డీఆర్డీఏ ఉన్నతాధికారుల బృందం కడియపులంక పంచాయతీలో విచారణను గురువారం ప్రారంభించారు. స్త్రీ నిధి ఏజీఎం ఎం.ధర్మేంద్ర, డీపీఎం వై.జనార్దనరావు పంచాయతీ కార్యాలయంలో డ్వాక్రా సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. సర్పంచ్ పాటంశెట్టి రాంజీ తదితరులు పాల్గొన్నారు.


యార్లగడ్డకు సత్కారం



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న అక్కినేని అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక సీపీ బ్రౌన్ మందిరానికి విచ్చేసిన పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను గురువారం అక్కినేని అభిమానులు సత్కరించారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. నిమ్మలపూడి గోవిందు, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, అడబాల మరిడయ్య, అడబాలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలతో రాకపోకలకు అవస్థలు




ద్విచక్ర వాహనచోదకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రకాశం నగర్: దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరీ దేవి 91వ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. కాగా గురువారం ఆంక్షల పేరుతో పోలీసులు ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికంగా ఉండే వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరా మొదటి రోజు రావడంతో భక్తుల తాకిడి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి పోలీసులు స్థానికంగా ఉండే వ్యాపారులను, స్థానికులను సైతం అనుమతించలేదు. గతంలో దేవీచౌక్ సెంటర్‌లో ఒక వైపు ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇచ్చి, మరోవైపు భక్తులకు దర్శనం ఏర్పాటు చేసేవారు. కానీ ఇప్పుడు పూర్తిగా రాకపోకలు నిలిపివేయడంతో తమ వ్యాపారాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చదువుకు అపార్ ప్రయోజనం

- ఆధార్ తరహాలో కార్డులు
- తొలుత 9, 10 తరగతుల విద్యార్థుల వివరాల నమోదు
- మొదలైన ప్రక్రియ



అపార్ ఐడీ నమూనా కార్డు

కంబాలచెరువు: దేశ పౌరులందరికీ ఆధార్ కార్డు మంజూరు చేస్తున్న విధానంలోనే విద్యార్థులకు ఆటోమోటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డులు అందజేయనున్నారు. వీటికి సంబంధించి నమోదు పక్రియ రాజమహేంద్రరం అర్బన్, రూరల్‌లో ప్రారంభమైంది. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రాలను సంబంధిత స్కూలు ప్రధానోపాధ్యాయులు తీసుకుంటున్నారు. ఈ పక్రియ ఈ నెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని విద్యాశాఖ కమిషనర్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

9, 10 తరగతుల విద్యార్థులకు..

ముందుగా నగరంలోని 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల వివరాలను అపార్ దరఖాస్తులో పొందుపర్చుతున్నారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యాజమాన్యాల స్కూళ్లలో ఈ పక్రియ పూర్తిచేసే దిశగా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. దీనికి సంబంధించి అపార్ దరఖాస్తును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. వారు దసరా సెలవులు ముగిసేలోపు వాటిని పూర్తిచేసి, సంబంధిత స్కూల్ హెచ్ఎంలకు అందజేయాలి. అవి స్థానిక విద్యాశాఖాధికారులకు అందజేసిన తర్వాత అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

నమోదు ప్రారంభం

తొలుత 9, 10 తరగతి విద్యార్థులకు అపార్ నంబర్ జనరేట్ అయ్యి, విజయవంతంగా పూర్తయిన వెంటనే ప్రైమరీ నుంచి హైస్కూలు స్థాయి వరకూ అన్ని తరగతుల విద్యార్థుల వివరాలు సేకరించనున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్‌కు సంబంధించి 66 స్కూళ్లలో అపార్ నమోదు ప్రారంభించారు. సుమారు 13 వేల మంది హైస్కూలు విద్యార్థులకు ముందుగా ఈ నంబర్ రానుంది. అపార్ కార్డుల ద్వారా విద్యార్థులకు అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయి.

అవగాహన

విద్యార్థులు దసరా సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన వెంటనే సమ్మతి పత్రాలు తీసుకుంటారు. వాటిలో పేరు, పుట్టిన తేదీ వివరాలు ఆధార్ వివరాలతో సరిపోలుతున్నాయో, లేదో తల్లిదండ్రులు, స్కూలు హెచ్ఎంలు ధ్రువీకరించుకోవాలి. అలాగే అపార్ దరఖాస్తు పూర్తి చేయడంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులకు చెబుతున్నారు. వన్ ఐడీ నంబర్ వచ్చాక దానిని ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో అవగాహన కల్పిస్తున్నారు.

ఎంతో ప్రయోజనం

యూడీఐఎస్ఈప్లస్ పాఠశాల లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను వివరాలను నమోదు చేయాలి. విద్యార్థి వివరాల గోప్యత విషయంలో ఎటువంటి సందేహం పడాల్సిన పనిలేదు. అపార్‌తో ఏబీసీ, డీఎస్‌కేతో కలిపి విద్యాఫలితాలు, స్కాలర్‌షిప్ టెస్టులు, బెనిఫిట్ ప్రోగ్రామ్‌లు, రాష్ట్రం అమలు చేసే ఇతర పథకాల సామర్థ్యాన్ని తెలుసుకునే వీలుంటుంది. ప్రతి విద్యార్థి హాజరు, గ్రేడ్ వంటి వివరాలు ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతుంది. ప్రతిభావంతులైన విద్యార్థులు, స్కూలు మధ్యలో మానేసిన వారి వివరాలు తెలుసుకోవచ్చు.

నమోదు ప్రారంభించాం



వన్ నేషన్, వన్ ఐడీ కార్డు అయిన అపార్‌ను విద్యార్థులందరికీ అందించే దిశగా చర్యలు చేపట్టాం. ముందుగా 9, 10 తరగతుల విద్యార్థులకు అపార్ ఐడీ నంబర్ వస్తుంది. వారి వివరాలను నమోదు పక్రియ ప్రారంభించాం. దసరా సెలవులు పూర్తయ్యే సరికి అపార్ తొలి దశ నమోదు పక్రియ పూర్తి చేస్తాం. దీనికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలతో పాటు అన్ని ప్రైవేట్ స్కూలు యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేసాం. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అపార్ నంబర్ పొందాలి.

– బి.దిలీప్‌కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం.

95 కేజీల లడ్డూ సమర్పణ



లడ్డూను కమిటీ సభ్యులకు అందజేస్తున్న నానాజీ

కడియం: మండల కేంద్రమైన కడియంలోని శ్రీదేవి అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన వెంకట భక్తాంజనేయ స్వీట్‌స్టాల్ యజమాని నేతి నానాజీ 95 కేజీల లడ్డూ సమర్పించారు. అమ్మవారి ముఖాకృతితో రూపొందించిన ఈ ప్రసాదాన్ని గురువారం కమిటీ సభ్యులకు అందజేశారు.

ఐదుగురు సీఐల నియామకం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం డివిజన్‌లో ఐదుగురు సీఐలను నియమిస్తూ ఎస్పీ డి.నరసింహ కిశోర్ గురువారం ఉత్వర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరం ట్రాఫిక్ సీఐలుగా వీఆర్‌లో ఉన్న అబ్దుల్ నబీ, డీసీఆర్‌బీ పనిచేస్తున్న సీహెచ్. సూరిబాబును నియమించారు. అలాగే వీఆర్‌లో ఉన్న కె.మంగాదేవిని మహిళా పోలీస్‌స్టేషన్‌కు, పీఈ పవన్ కుమార్ రెడ్డిని డీసీఆర్‌బీకు, బి.విజయ్ శంకర్‌ను వన్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌కు, ఈ.బాలశౌరిని టూటౌన్ క్రైం, వై.రాంబాబు త్రీటౌన్ క్రైం సీఐలుగా నియమించారు.

ఉద్యోగులు సేవలు అభినందనీయం



ఎంపీడీవో శ్రీనివాసరావును సత్కరిస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు కొనియాడారు. మండలం నుంచి బదిలీ అయిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బందికి గురువారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. పింఛన్ల పంపిణీలో అధికారులు, సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయమన్నారు. బదిలీపై వెళుతున్న మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి బీవీజీఎస్ఆర్ చార్యులు, ఈవోపీఆర్అండ్ఆర్డీ డి.బాబూరావు, సీనియర్ అసిస్టెంట్ డీపీ కాంతారావు, టైపిస్ట్ కేఎస్ఎల్ కాంతం, పంచాయతీ కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరెడ్డి, డి.సూర్యనారాయణ, జి.వెంకటరావు, కె.హనుమంతరావు, ఎం.రూప్‌చంద్, జీవీవీకే విశ్వనాథం, ఎం.విజయారెడ్డి, సచివాలయ ఉద్యోగులు కె.మాధవ గణేష్, కేవీ లక్ష్మీప్రసన్న, బి.రాంబాబు, ఎం.పవన్ కుమార్, ఎం.అమూల్య, జి.ఎథీషాలను సత్కరించారు. అనంతరం ఎంపీడీవో డి.శ్రీనివాసరావును బదిలీ అయిన ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆకెళ్ల వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలల పార్లమెంట్‌లో రాజమహేంద్రవరం విద్యార్థులు



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న రాజమహేంద్రవరం విద్యార్థులు

కంబాలచెరువు: జాతీయ బాలల పార్లమెంట్ సమావేశాల్లో రాజమహేంద్రవరం లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆ బృందానికి నాయకత్వం వహించిన లూథరన్ ఎయిడెడ్ హైస్కూల్ మానవ హక్కుల బోధనా ఉపాధ్యాయుడు టి.మార్టిన్ సుధాకర్ గురువారం తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ నెల ఒకటి నుంచి మూడు వరకూ జాతీయ బాలల పార్లమెంట్ సమావేశాలు జరిగాయన్నారు. వీటికి కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వివిధ పాఠశాలలకు చెందిన వంద మంది బాలబాలికలు, 30 మంది కోఆర్డినేటర్లు పాల్గొన్నారన్నారు. బాలల హక్కులు, బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఏమి చేయాలి అనేదానిపై చర్చ జరిగిందన్నారు. సమావేశంలో న్యూస్ లెటర్ తయారీపై శిక్షణ ఇచ్చారని, పారా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురు విద్యార్థులు, ముగ్గురు టీచర్లు పాల్గొన్నారన్నారు. ఈ సమావేశపు ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి సిరిలతారెడ్డి హోం మినిస్టర్‌గా, సాయగణేష్ అగ్రికల్చర్ మినిస్టర్‌గా, మహేష్ సీనియర్ సిటిజన్ మినిస్టర్‌గా ఎన్నికయ్యారన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం



సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు చెక్కు అందిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జవహర్ వాకర్స్ క్లబ్ తరఫున రూ.1.23 వేలు అందజేశారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ గురువారం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు చెక్కు అందజేశారు. సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వరద బాధితుల కోసం క్లబ్ సభ్యుల నుంచి విరాళాలు సేకరించామన్నారు. రూ.80 వేలను క్లబ్ ద్వారా, ఉష లేడీస్ లాఫింగ్ యోగా సభ్యులు ఇచ్చిన రూ.43 వేలను కలిపి మొత్తం రూ.1.23 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి అందచేసినట్టు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో అపరిశుభ్రతపై ఆగ్రహం



పరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైల్వే పీసీఎండీ వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని, వాటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సౌత్ సెంట్రల్ రైల్వే పీసీఎండీ సి.వెంకటేశ్వర్లు, సీఎండీ శౌర్యబాల హెచ్చరించారు. గురువారం రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను స్టేషన్ మాస్టర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, రైల్వే డాక్టర్ సునీల్, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములుతో కలసి పరిశీలించారు. ప్లాట్‌ఫాంలు, మరుగుదొడ్లు, వైటింగ్ హాళ్లలో నెలకొన్న అపరిశుభ్రతపై కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైల్వే అడ్వైజరీ బోర్డ్ మెంబర్లు పీవీ సుబ్రహ్మణ్యం, హరిరాం, యానాపు ఏసు, బండి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ స్టాలిన్

కడియం: గ్రామాభివృద్ధి అందరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఆ గ్రామంలో గురువారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి, ముందుగానే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే గ్రామ సభ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు తెలిపిన సమస్యలను నమోదు చేసుకున్నారు.

కార్యదర్శి శిరీషకు సత్కారం

జేగురుపాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై గోకవరం కార్యదర్శిగా వెళుతున్న బి.శిరీషను గ్రామసభలో భాగంగా గురువారం ఘనంగా సత్కరించారు. కార్యదర్శిగా శిరీష గ్రామాభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఆకుల సుధాకర్, నాగిరెడ్డి రామకృష్ణ, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి శివాజీ, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్‌కుమార్, స్థానిక నాయకులు బళ్ల అన్నవరం, మారిశెట్టి నాగన్న, బోడా అచ్యుత్, నాగిరెడ్డి మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సప్తగిరి హేచరీస్‌ను సందర్శించిన ఆర్ట్స్ విద్యార్థులు



సప్తగిరి హేచరీస్‌లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని డిగ్రీ, పీజీ ఆక్వాకల్చర్ విద్యార్థులు కాకినాడ సమీపంలోని ఉప్పాడలో ఉన్న సప్తగిరి హేచరీస్, రొయ్యపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ మేరకు ఆ వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. ఈ విజ్ఞాన యాత్రలో పాల్గొన్న ఆక్వాకల్చర్ విద్యార్థులు నీటి నాణ్యత, రొయ్య ఆహార విధానాలు, నాణ్యత, రొయ్య పిల్లల ఉత్పాదకత మొదలగు అంశాలపై సమగ్ర సమాచారం తెలుసుకున్నారన్నారు. చైర్మన్ సత్తి సూర్యనారాయణరెడ్డి, డైరెక్టర్ వేంకటేశ్వరరావు, క్వాలిటీ కంట్రోల్ విభాగం డైరెక్టర్ రాజ్ కుమార్ తదితరులు సప్తగిరి హేచరీస్‌లో అనుసరిస్తున్న అత్యాధునిక పద్ధతులను వివరించారన్నారు. దాదాపు 80 మంది విద్యార్థులు, జంతుశాస్త్ర అధ్యాపకులు జి.రవితేజ, ఎం.విజయశాంతి, టి.రఘువీర్, కె.సోనియా, రాజు, కళాశాల పీఆర్‌వో డాక్టర్ జె.సురేష్ విజ్ఞాన యాత్రలో పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకపోవడం అన్యాయం

ప్రకాశం నగర్: సత్యసాయి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 16 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.పూర్ణిమ రాజు అన్నారు. లాలాచెరువు భాస్కర్ నగర్‌లో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణిమ రాజు మాట్లాడుతూ సుమారు 75 గ్రామాలకు తాగునీటిని పైప్‌లైన్ల ద్వారా అందిస్తున్న కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరమ పావని.. దుర్గాభవాని

- దసరా మహోత్సవాలు ప్రారంభం
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



కొబ్బరి కాయల మార్కెట్ వద్ద అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ భరత్ రామ్



దుళ్లలో శారదా అమ్మవారి శరన్నవరాత్ర వేడుకల ప్రారంభం సందర్భంగా ఊరేగింపు



ఉమామార్కండేయేశ్వరస్వామి దేవాలయంలో శ్రీబాల



వాసవీ కన్యకా పరమేశ్వరికి పసుపు,కుంకుమతో అలంకరణ



వన బాలాత్రిపుర సుందరి దేవిగా అమ్మవారు

సీటీఆర్ఐ: దసరా శరన్నవరాత్ర వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరీదేవి స్వర్ణ కవచాలంకృత శ్రీదుర్గాదేవిగా, ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో శ్రీబాలగా, సారంగధరేశ్వర స్వామి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమిచ్చారు. మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ భవానీ దీక్షను స్వీకరించారు. అక్షర కోటి గాయత్రీ చక్రపీఠంలో విశేష పూజలు నిర్వహించారు. దేవీచౌక్‌లో రాత్రి 10 గంటలకు కనకదుర్గా మహత్యం నాటకాన్ని ప్రదర్శించారు. అన్నపూర్ణమ్మపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి క్షేత్రంలో అన్నపూర్ణాదేవిని వన బాలా త్రిపుర సుందరి దేవిగా అలకరించారు.

కొలువుదీరిన అమ్మవారు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త, న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. బొమ్మూరు జాతీయ రహదారి పక్కన కనకదుర్గాదేవి, రాజవోలు రోడ్డులోని కనకదుర్గాదేవి, నాగదుర్గాదేవి, కొంతమూరు బీసీ కాలనీలోని కనకదుర్గాదేవి ఆలయాల్లో పూజలు జరిగాయి. 28వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నేత బిల్డర్ చిన్న నేతృత్వంలో ఏర్పాటు చేసిన శరన్నవరాత్ర వేడుకల్లో పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతులు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు.

కడియం: మండల కేంద్రమైన కడియం దేవీచౌక్ సెంటర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో కలశస్థాపన చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుళ్లలోని శారదా అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అమ్మవారి చిత్రపటాన్ని మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపి, ఆలయంలో ప్రతిష్ఠించారు. పొట్టిలంక, వీరవరం, దామిరెడ్డిపల్లి, కడియపుసావరం, జేగురుపాడు, మురమండ, మాధవరాయుడుపాలెం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద విశేష పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న జిల్లా న్యాయమూర్తి గంధం సునీత



కొత్తపేటలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు



28వ డివిజన్‌లో శరన్నవరాత్రుల వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులు



గౌతమఘాట్‌లోని జ్ఞాన సరస్వతీ పీఠంలో సరస్వతీ మాతకు పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న చందన నాగేశ్వర్